క్లుప్తంగా

పూడిక తీశారు..



సాక్షి ఎఫెక్ట్..

భీమారం: మండలంలోని ఆరెపెల్లి ఎస్సీ కాలనీలో డ్రెయినేజీల్లో పూడిక నిండి దుర్వాసన వెదజల్లుతోందని, 'పూడిక తొలగించరూ..' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. మురుగుకాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించే పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

18న బహిరంగ వేలం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా 25 నుంచి 27వరకు నిర్వహించే జాతరలో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవికిషన్ తెలిపారు. ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పులిహోర, లడ్డూ ప్రసాదం, నూనె అమ్మకం, బోనములు చెల్లించుటకు వేలం నిర్వహించనున్నట్లు, ఆసక్తి ఉన్న వారు రూ.10వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

బోదకాలు గుర్తింపు సర్వే



రక్త నమునాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

కోటపల్లి: మండలకేంద్రంలో బోదకాలు గుర్తింపు కోసం కోటపల్లి ప్రాథమిక కేంద్రం వైద్యురాలు డాక్టర్ అరుణశ్రీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సర్వే నిర్వహించారు. మొత్తం ఆరు బృందాలుగా 300మంది రక్తనమునాలు సేకరించారు. బోదకాలు వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంగయ్య, హెచ్‌ఈవో జగదీశ్, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పారామెడికల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మౌనిక

భీమారం: సమాజంలో బాల్యవివాహాలను అరికట్టాలని మహిళా సాధికారక హబ్ జెండర్ మౌనిక కోరారు. భేటీ బచావో–భేటీ పడావో పథకం కింద శనివారం ఐకేపీ కార్యాలయంలో సీఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలతో ఎప్పుడూ అందుబాటులో ఉండే మహిళా సంఘాల సీఏలు బాల్య వివాహాలతో జరిగే నష్టాల గురించి ఎప్పటికప్పుడు వివరించాలని కోరారు. ఆడపిల్లల పై వివక్షత చూపొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం త్రియంబకేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

బెల్లంపల్లి/పాతమంచిర్యాల: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. జిల్లా కేంద్రం, బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేయడం వల్లనే కాంగ్రెస్ పార్టీ తనను పార్టీ నుంచి బహిష్కరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఇంటింటా సర్వే సహేతుకంగా లేదన్నారు. పెరిగిన జనాభా వివరాలను వెల్లడించకుండా పాత జనాభా లెక్కలను బహిర్గతం చేసిందని విమర్శించారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రజల గొంతుకగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనను గెలిపించాల్సిన ఆవశ్యకతను పట్టభద్రులు గుర్తించాలని కోరారు. మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటువేసి అధిక మెజార్టీతో గెలిపించి తనను చట్టసభలోకి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

- పూజలు నిర్వహించిన బంజారాలు



జన్నారం: ర్యాలీతో చౌక్ వద్దకు వస్తున్న బంజార కులస్తులు

జన్నారం/కోటపల్లి: శ్రీశ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజు జయంతిని కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలోని సేవాలాల్ మహారాజ్ ఆలయంలో, జన్నారం మండలంలో ఘనంగా నిర్వహించారు. జన్నారం బస్టాండ్ నుంచి మార్కెట్ రోడ్డులో గల సేవాలాల్ చౌక్ వరకు ర్యాలీ తీసి, అనంతరం సేవాలాల్, జగదాంబ దేవీలకు పూజలు చేశారు. సేవాలాల్ మహారాజ్ జెండాను ఎగురవేశారు. సర్వాయిపేటలో భోగ్ భండార్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. జన్నారంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌రాథోడ్, బంజార సేవా సంఘం నాయకులు భీంలాల్‌నాయక్, సందేశ్‌నాయక్, బద్రినాయక్, దినేశ్‌నాయక్, తిరుపతి నాయక్, రాములు నాయక్, ధర్మునాయక్, బీఎస్పీ నాయక్, కోటపల్లిలో మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, బస్సీనాయక్, సమ్మయ్యనాయక్, జన్యనాయక్, రాములు, బాపు, రాజేశ్, దేశీనాయక్, రాంచందు, మల్లేశ్, రాజేశ్, మోహన్ పాల్గొన్నారు.

బూర్గుపల్లిలో...

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో సేవాలాల్ సేనా ఆధ్వర్యంలో శనివారం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను బుక్యా రాజ్‌కుమార్‌నాయక్ ప్రారంభించారు.

సోమగూడెంలో...

కాసిపేట: మండలంలోని సోమగూడెం(కె)తండాలో శనివారం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమగూడెం హైవే పక్కన జెండావిష్కరణ, భోగ్ బండార్ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ పాల్గొన్నారు. భజన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, లంబాడ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సఫాట్ శంకర్, తండా నాయకులు అజ్మీర శ్రీనివాస్, సఫాట్ చందు, అజ్మీర తారు, బానోత్ పరశురాం, బోడ బలరాం, బానోత్ గనిరాం, కున్సోత్ శ్రీనివాస్, సురేష్ తదితరులున్నారు.

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట, కొత్తూర్, నెన్నెల, లంబాడితండాల్లో బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని బంజారాలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కున్సోతు నారాయణ, గుగ్లోతు మల్లేష్, పాల్తె శ్రీను, తిరుమల్, రాజ్‌కుమార్, రవి, బాబులాల్ పాల్గొన్నారు.



కోటపల్లి: సర్వాయిపేటలో...



భీమారం మండలం బూర్గుపల్లిలో...



నెన్నెల: నార్వాయిపేటలో...

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభిస్తున్న కలెక్టర్

బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బెల్లంపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఐకేపీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇందిర మహిళా శక్తి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిర మహిళా శక్తి పథకంలో క్యాంటీన్లు, మీసేవ, పెరటి కోళ్ల పెంపకం, కోళ్ల ఫారం, డెయిరీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు వర్తింపజేయడం జరిగిందని వివరించారు. క్యాంటీన్లలో వినియోగదారులకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్, మండల ప్రత్యేక అధికారి, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో మహేందర్, ఐకేపీ ఏపీఎం శ్యామల, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'కేసీఆర్ కృషితోనే తెలంగాణ అభివృద్ధి'



మొక్క నాటుతున్న దివాకర్‌రావు, నాయకులు

నస్పూర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో, రాష్ట్ర అభివృద్ధిలో కేసీఆర్ కృషి మరువలేనిదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు అన్నారు. కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ఆవరణలో శనివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తన పాలనతో తెలంగాణకు బంగారు భవిష్యత్తు అందించారన్నారు. పేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని నిరంతరాయంగా అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, రాష్ట్ర నాయకుడు నడిపల్లి విజిత్ రావు, కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు వంగ తిరుపతి, కుర్మిళ్ల అన్నపూర్ణ, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు అత్తి సరోజ, రామస్వామి, జనార్దన్, రవీందర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 17న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు తిరుపతి, బాపు, జగన్నాధుల శ్రీనివాస్, పాశం ఆశీష్, నాయిని సతీశ్, మానిశెట్టి శ్రీనివాస్, మేడ సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్



సూర్యనారాయణను సన్మానిస్తున్న శ్రీనివాస్, అధికారులు

నస్పూర్: సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రతీ ఉద్యోగి పాటుపడి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా పనిచేసి సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్‌గా పదోన్నతితో బదిలీపై వెళ్తున్న ఎల్‌వీ సూర్యనారాయణను జీఎం కార్యాలయ సిబ్బంది కాన్ఫరెన్స్ హాల్లో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. సూర్యనారాయణ అతి తక్కువ కాలంలోనే ఏరియాలో ఉత్పత్తి లక్ష్యసాధనతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి తనవంతు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఐకే ఓసీ పీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొముర‌య్య, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో....

సింగరేణి కాలరీస్ ఎస్సీఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్‌వీ సూర్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, సంఘం చీఫ్ అడ్వైజర్లు చిరంజీవి, తిరుపతి, రాజేశ్వర్‌రావు, స్వామిరాజు, బ్రాంచి సెక్రటరీ అంద వెంకటేశ్, గుణిగంటి నర్సింగరావు, సారయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

- ప్రధాని మోదీకి బీసీ హక్కుల పోరాట సమితి లేఖ



లేఖను ప్రదర్శిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం మాట్లాడారు. కుల గణన చేపట్టాలని ప్రధాని మోదీకి రాసిన లేఖను విడుదల చేశారు. బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండియాలో 1931లో బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో కులగణన చేపడితే అప్పటి నుంచి కులగణన చేపట్టలేదన్నారు. కుల గణనకు అనుకూలంగా 27రాజకీయ పార్టీలు కేంద్రానికి లేఖలు ఇచ్చాయని తెలిపారు. 10 రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి సమర్పించినా కేంద్రం స్పందించడం లేదని విమర్శించారు. బీసీలకు రావాల్సిన ప్రజాస్వామ్య వాటా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణనను చేరిస్తే విద్యా ఉద్యోగాలతోపాటు ప్రస్తుతం స్థానిక సంస్థల్లో కొనసాగుతున్న రిజర్వేషన్లు పెంచాల్సి ఉంటుందన్నారు. అందుకే కులగణనను చేపట్టడం లేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు భీంసేన్, కర్రె లచ్చన్న, శ్రీపతి రాములు, గజ్జెల్లి వెంకన్న, అంకం సతీశ్, ఆరెందుల రాజేశం, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రీసర్వే త్వరగా చేపట్టాలి

పాతమంచిర్యాల: రాష్ట్రంలో బీసీ కుల గణనలో లోపాలు సరిచేసేందుకు రీసర్వే త్వరగా చేపట్టాలని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీ కుల గణన చేపట్టిందని, అయితే ఆ సర్వేలో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. బీసీ జనాభాను తక్కువగా చూపించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిపుణుల కమిటీ వేసి రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు తులా మధుసూదన్ రావు, వెంకటయ్య, అవిడపు గణేశ్, డేగ సురేశ్, చేర్యాలు, నాగరాజు, విజయ్, వెంకటేశ్వర్, ఎండీ.లతీఫ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల బియ్యం పక్కదారి

- రెవెన్యూ సిబ్బంది విచారణతో వెలుగులోకి..



బియ్యం స్టాక్ పరిశీలిస్తున్న ఆర్ఐ

వేమనపల్లి: వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల బియ్యం తరలింపులో అక్రమాలు వెలుగుచూశాయి. కోటపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 28క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు ఆర్వో(రిలీజ్ ఆర్డర్)లో పేర్కొని, ప్రైవేట్ వాహనంలో 18క్వింటాళ్లు మాత్రమే పంపించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందగా తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ ఖాలీక్ శనివారం ఆశ్రమ పాఠశాలకు వెళ్లి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని విచారణ జరిపారు. ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది కుమ్మక్కై బియ్యం పక్కదారి పట్టిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. గోదాం నుంచి బియ్యం తరలించేటప్పుడు రూట్ ఆఫీసర్ ఉండాలి, ఎక్కడికి పంపుతున్నారో వారి సంతకం ఉండాలి కానీ రూట్ ఆఫీసర్ లేకుండానే ఏడు నెలల క్రితం ఆశ్రమ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన సీనియర్ ఉపాధ్యాయుడు మధునయ్య (తను లేకుండానే) తంబ్(సంతకం) ఆధారంతో గోదాం నుంచి బియ్యం తరలించడం అనుమానాలకు తావిస్తోంది. 28క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు ఆర్వో రాసి 18క్వింటాళ్ల మాత్రమే పంపిస్తున్నట్లు ట్రిక్ షీట్‌లో పొందుపర్చినట్లు విచారణలో గుర్తించారు. మిగితా 10క్వింటాళ్ల పక్కదారి పట్టించే ప్రయత్నం జరిగినట్లు నిర్ధారణలో తేలింది. ఈ విధంగా ప్రతి నెలా 10నుంచి 15క్వింటాళ్ల బియ్యం దారిమళ్లుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు విచారణకు వెళ్లినప్పుడు ఆశ్రమ పాఠశాలలో 20క్వింటాళ్ల మిగులు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలు వెలికి తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విశ్వశాంతి మహాయాగం ప్రారంభం



యాగశాల వద్ద పూజలు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాల వద్ద 86వ విశ్వశాంతి మహాయాగం శనివారం ప్రారంభమైంది. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛారణతో యాగం ప్రారంభించారు. గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, ఋత్విక్ వరుణ, గోసహిత యాగశాల ప్రవేశం, అఖండజ్యో తి స్థాపన, యాగశాల సంస్కారములు, మా తృపూజ, మండపారాధనలు, వాస్తు హోమాలు, ప్రధాన మంటపారాధన, ప్రధాన కలశస్థాపన, అగ్ని మథన, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారో హణం, పర్యాఙ్ఞీకరణ కార్యాక్రమాలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

'అక్రమ నిర్మాణాలు తొలగించాలి'

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు శనివారం బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ములకల్ల రాజేంద్ర ప్రసాద్ వినతిపత్రం అందించారు. అక్రమ నిర్మాణాల వల్ల మార్కెట్లో వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బంది అవుతుందని వివరించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు శంకర్, మతిన్‌ఖాన్ ఉన్నారు.

అలరించిన ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్‌ఫెస్టివల్‌లో వంటకాల ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ హర్ష డిగ్రీ కళాశాలలో శనివారం ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ అలరించింది. విద్యార్థులే స్వయంగా ఎంతో రుచికరంగా తయారు చేసిన వంటకాలు కొనుగోలు చేసేందుకు పలువురు పోటీపడ్డారు. జొన్నరొట్టె, అంబలి, అరిసెలు, ఫ్రూట్‌సలాట్, పలురకాలు వంటలు విక్రయించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ భూమేశ్ మాట్లాడుతూ.. న్యూట్రీషన్ అనేది మానవులకు చాలా అవసరమని, పిల్లల నుంచి పెద్దల వరకు పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలరని, ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిత ఠాకూర్, అధ్యాపకులు శ్రావణి, కీర్తి, మానస తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లకు ఐఎస్‌వో సర్టిఫికెట్ ఉండాలి



యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో గల వాటర్‌ప్లాంట్లకు ఐఎస్‌వో సర్టిఫికెట్ కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చెన్నూర్ వాటర్‌ప్లాంట్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రతి నెలా నీటి పరీక్షలు నిర్వహించిన ధ్రువీకరణ పత్రాన్ని కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ప్రతీ వాటర్‌ప్లాంట్ యజమాని ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వాటర్‌ప్లాంట్ల యజమానులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవితానికి రాజయోగ సాధన

మంచిర్యాలఅర్బన్: ఆరోగ్యకరం, సంతృప్తికరమైన జీవితం గడపటానికి రాజయోగ సాధన తోడ్పతుందని హైదారాబాద్ బ్రహ్మకుమారి ఇన్‌చార్జి శక్తిబెహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీలో నిర్మించిన బ్రహ్మకుమారి దివ్య దర్శన భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ కర్యాక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన శక్తి బెహన్ శనివార మాట్లాడారు. 30 ఏళ్లుగా బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ధార్మిక, ఆరోగ్య, రైతు స్వగౌరవ సభలు, సామాజిక ప్రగతి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఆదివారం ఐబీ చౌరస్తా నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల బ్రహ్మకుమారీస్ శాఖ ప్రతినిధి కులదీప్‌దీదీ, కరీంనగర్ రీజియన్ ఇన్‌చార్జి విజయ్‌బెహన్‌జీతోపాటు పలువురు అతిథులకు స్వాగతం పలకనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మంచిర్యాల ఇన్‌చార్జి రమ, కోరుట్ల ఇన్‌చార్జి రాజేశ్వరి, హైదరాబాద్ ధ్యాన ఇన్‌చార్జి నిర్మల, పద్మ, రుచి, శ్రీవాణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

నెన్నెల: ఇటీవల బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ అష్రద్ తల్లి చోటీమా అకస్మాత్తుగా కిందపడిపోవడంతో గాయాలపాలై కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఆస్పత్రికెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

20న 'చలో హైదరాబాద్'

తాండూర్(బెల్లంపల్లి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ శ్రేణులు తెలిపారు. తాండూర్ మండలం మాదారంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. హామీల అమలు కోసం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, న్యూడెమోక్రసీ నాయకులు రాజు, లక్ష్మీ, నాందేవ్, చంద్రక్క, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

చెన్నూర్/దండేపల్లి: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు అంజిరెడ్డి,కొమురయ్యలను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, దండేపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య కోరారు. చెన్నూర్, దండేపల్లిలో శనివారం ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయండి

మంచిర్యాలటౌన్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన భార్య గవ్వల లక్ష్మి పోటీ చేస్తున్నామని తమను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గవ్వల శ్రీకాంత్ కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం పలువురు పట్టభద్రులను కలిసి తమకు ఓటు వేయాలని కోరారు.

నేటి నుంచి కుటుంబ సమగ్ర సర్వే

చెన్నూర్: మున్సిపాలిటీలో ఆదివారం నుంచి ఈ నెల 28వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. గతంలో సర్వేలో పాల్గొనని పట్టణ ప్రజలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొప్పల రాజును సన్మానించిన ఎమ్మెల్యే



రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: జార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన కొప్పుల రాజును శనివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శాలువాతో సన్మానించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాసానికి వచ్చిన సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యే సన్మానించారు.